నారాయణ పట్నం పోరులో అలలై ఎగుస్తున్న ఆదివాసీ రైతాంగ మహిళలు

బి.డి.దమయంతి

ఒడిషా ఆదివాసీ రైతాంగానికి సుసంపన్నమైన పోరాట చరిత్ర వుంది. నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఇక్కడ పలు తిరుగుబాట్లు జరిగాయి. ఆ పోరాటాల వారసత్వం నేటికీ కొనసాగుతున్నది. సామ్రాజ్యవాదానికీ, బహుళజాతి కంపెనీలకు ఊడిగం చేస్తోన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడి అటవీ సంపదను దోచి పెట్టడం కోసం ఎన్నో అవగాహనా ఒప్పందాలను చేసుకున్నాయి. ఆదివాసీల అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేస్తోన్న ప్రభుత్వాల ఈ సామ్రాజ్యవాద లొంగుబాటుకు వ్యతిరేకంగా రాష్ట్రంలో జరిగిన కాశీపూర్, కళింగనగర్ పోరాటాలు మనకు తెల్సు. కాశీపూర్, కళింగనగర్‌లతో పోల్చితే సమస్య భిన్నమైనది అయినప్పటికీ ఈ ఒరవడిని కొనసాగిస్తూ నేడు నారాయణపట్నం పోరాటం కొనసాగుతున్నది.

మొదటి నుంచీ అన్ని పోరాటాల్లోనూ కదిలినట్టుగానే నేడు నారాయణపట్నం పోరులోనూ ఆదివాసీ రైతాంగ మహిళలు వీరోచిత పాత్ర వహిస్తున్నారు. తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా పెనుగులాడుతున్నారు.

ఒడిషాలోని కోరాపుట్ జిల్లాలో నారాయణపట్నం బ్లాక్ వుంది. ఇక్కడ దాదాపు 38 వేల జనాభా వుండగా, అందులో ఆదివాసీలు దాదాపు 82 శాతం వున్నారు. దేశవ్యాప్తంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులే వీరూ ఎదుర్కొంటున్నారు. ఒడిషా వెనక బడిన రాష్ట్రంగా పేరుపోయింది. ఎన్నో వనరులనూ, సంపదలనూ గర్భంలో దాచుకొని నిత్యం కరువు కాటకాలతో బాధ పడుతున్న రాష్ట్రమిది. ఈ పరిస్థితులు ఆదివాసీల జీవితాలను ఇంకెంత దుర్భరం చేస్తాయో ఊహించుకోవడం కష్టమేమీ కాదు. ఆకలి అనారోగ్యం వీరితో సహజీవనం చేస్తాయి. ఆకలి చావులూ, అనారోగ్య చావులే వీరికి సహజమైన చావులయ్యాయి. ఏ రకమైన సౌకర్యాలూ వీరి ఊహలకు కూడా అందవు.

ఇక ఈ పరిస్థితులకు తోడు వీరు గురవుతున్న దోపిడీకి అంతులేదు. 1970లలో శ్రీకాకుళ ఆదివాసీ పోరాట జ్వాలలకు జడిసి పారిపోయి వచ్చిన ఆదివాసేతర భూస్వామ్య, వ్యాపార వర్గాలు ఈ ప్రాంతంలో స్థిరపడి తమ దోపిడీని ఇక్కడి ఆదివాసులపై ఎక్కు పెట్టారు. వీరే కాక ఆంధ్ర ప్రదేశ్‌లోని కోస్తాంధ్ర నుంచీ, ఒడిషా నుంచీ ఎంతో మంది ఆదివాసేతరులు ఇక్కడికి వచ్చి, స్థిరపడి స్థానిక ప్రజల భూములను, హక్కులను హరించడం మొదలు పెట్టారు. ఆదివాసీల భూములు వారికే చెందడం కోసం ఉద్దేశించిన 2/56 చట్టం కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా ఇక్కడి ప్రజలు జల్, జంగల్, జమీన్‌లపై అధికారం కోల్పోయి తమ గడ్డ మీద పరాయివాళ్లలా బతుకుతున్నారు. ప్రభుత్వం, అటవీ విభాగం, ఆదివాసేతరుల దోపిడీ పీడనల నడుమ నలిగిపోతున్నారు.

ఇలా కునారిల్లుతున్న వీరి జీవితాలు సారా వల్ల మరింతగా దిగజారాయి. సారా తమ బతుకులను ఛిద్రం చేయడమే గాక, తమ బతుకులను మార్చుకోవాలనే చైతన్యాన్నీ మొద్దు బారుస్తుందన్న విషయం గుర్తించిన ఆదివాసీలు మద్యానికి వ్యతిరేకంగా ఉద్యమించడం మొదలు పెట్టారు. 2009 జనవరిలో నారాయణపట్నం బ్లాక్‌లోని అన్ని గ్రామాల్లోనూ, బ్లాక్ కేంద్రమయిన నారాయణ పట్నంలోనూ ప్రభుత్వ, ప్రయివేటు సారా, బ్రాందీ దుకాణాలపై పెద్ద ఎత్తున దాడులు చేశారు. సారా బట్టీలనూ, సారా రవాణా చేసే వాహనాలనూ ధ్వంసం చేశారు. మొత్తంగా నాలుగు నెలల్లో సంపూర్ణ మద్య నిషేధాన్ని సాధించుకున్నారు. మద్యం వల్ల పురుషుల కంటే అనేక రెట్లు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా, సామాజికంగా వత్తిడికి గురయ్యే మహిళలే అత్యంత సహజంగా ఈ పోరాటంలో ముందు పీఠిన నిలిచారు. ఆదివాసీ ఛసి ములియా సంఘ్ (ఆదివాసీ రైతు కూలీ సంఘం) నాయకత్వంలో ఈ పోరాటం నడిచింది.

ఇలా సారా పోరాటంలో సంఘటితమైన ప్రజలు తమ దుర్భర దారిద్ర్యానికి మూలాలు తమ భూములపై, సంపదపై తాము కోల్పోయిన హక్కుల్లో ఉన్నాయని గ్రహించారు. అందుకే మోసం చేసి ఆదివాసేతర భూస్వాములు లాక్కున్న తమ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి పూనుకున్నారు. 2008 జూన్ 12న ఆరు పంచాయితీలకు చెందిన దాదాపు వంద గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు కదిలి భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకున్న దాదాపు మూడు వేల ఎకరాల భూముల్లో ఎర్ర జెండాలు పాతారు. సమిష్టిగా దున్నుకున్నారు. జూలై మొదటి వారంలో ఆ భూములను పంపిణీ చేసుకున్నారు. పంటలు వేసుకున్నారు. తమ చెమటతో తడిసి బంగారంలా పండిన పంటను నవంబర్ నెలలో కోసుకోవడానికి సిద్ధమయ్యారు.

ఈ క్రమమంతా సాఫీగా జరగలేదు. అలా జరుగుతుందని కూడా మనం ఆశించలేం. పీడక వర్గాలకు కొమ్ముకాసే ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఆందోళన సెగలు మొదలైనప్పటి నుండే నిర్బంధాన్ని ప్రయోగించడం మొదలుపెట్టింది. ప్రభుత్వ బలగాలు సరిపోనట్టు 'శాంతిసేన', 'నాగరిక సురక్షా సమితి'ల పేరుతో సల్వాజుడుం మూకను పోలిన కిరాయి మూకలను తయారు చేసి ప్రజల మీదికి ఉసిగొల్పుతున్నది. ఈ నిర్బంధాన్ని అడుగడుగునా ప్రతిఘటిస్తూనే ప్రజలు తమ భూములను కాపాడుకుంటూ పంటలు పండించుకున్నారు. కోతలకు సిద్ధమవుతుండగా 2009, నవంబర్ 20న ఉదయం పది గంటలకు నారాయణపట్నంకు రెండు కిలోమీటర్ల దూరంలో వున్న 'దుంబగూడ' అనే గ్రామానికి

పోలీసులు వెళ్లి ప్రజలను బెదిరించారు. మహిళలతో అసభ్యంగా మాట్లాడారు. దీనికి నిరసనగా అదే రోజు దాదాపు రెండు వందల మంది ప్రజలు నారాయణపట్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులను నిలదీశారు, పోలీసులు తమకు సమాధానం చెప్పాలని ఆందోళన చేశారు. ప్రజల ప్రతిఘటనను సహించలేకపోయిన పోలీసులు, ప్రజలతో ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం ఎన్నడూ అలవాటు లేని పోలీసులు ప్రజల మీదికి విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఆంద్రు అనే ఛసి ములియా సంఘ్ కార్యకర్త తలకు తూటా తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. ఛసి ములియా సంఘ్ నాయకుడైన సింగన్న గాయపడి పడిపోగా ఆ తర్వాత ఆయనను అత్యంత క్రూరంగా పోలీసులు నరికి చంపారు. ఇంకా అనేక మంది ఈ కాల్పుల్లో గాయపడ్డారు.

ఈ విధంగా నారాయణపట్నం పోరాటం నెత్తురోడింది. అయినప్పటికీ ప్రజలు పోరుబాటను వీడకుండా ఉత్తేజవంతంగా కొనసాగిస్తున్నారు. నక్సల్బరీ పోరును తలపించిన లాల్‌గఢ్ పోరాటంతో పోల్చతగినంత వీరోచితంగా ఈ పోరాటం కొనసాగుతున్నది.

ఈ పోరాటమంతటిలోనూ మహిళల పాత్ర ఉత్తేజకరమైనది. వాళ్లు తమ వర్గ సోదరులతో భుజం భుజం కల్పి వీరోచితంగా పోరాడుతూ సగర్వమైన భాగస్వామ్యాన్ని వహిస్తున్నారు. మహిళల భాగస్వామ్యం లేని ఆందోళన, ప్రదర్శన, ప్రతిఘటన, సభ, సమావేశం ఏదీ లేదు. కొన్నిట్లో మహిళలే ముందు భాగాన వుంటున్నారు. మరి కొన్నిట్లో మహిళలు మాత్రమే వుంటున్నారు. అలా ఈ పోరాటంలో విడదీయలేనంతగా వారి పాత్ర పెనవేసుకుపోయింది. విడదీయలేనిదే అయినప్పటికీ వారి పాత్రను అర్థం చేసుకోవడానికి ప్రత్యేకంగా చెప్పుకుందాం.

పోలీసులు, శాంతిసేన తదితర మూకల దాడులు గ్రామాలపై నిత్యకృత్యమైపోయిన పరిస్థితిలో ప్రతిఘటించడం కోసం మహిళలు సాంప్రదాయక ఆయుధాలతో పాటు, కారం పొడిని ఎల్లప్పుడూ సిద్ధంగా వుంచుకుంటున్నారు. "మేం ముందు వుంటాం, మీరు మా వెనక వుండండి" అని పురుషులను వెనక్కి పంపి తామే ప్రతిఘటనకు నాయకత్వం వహించి పోలీసులతో ఘర్షణ పడి, గాయపర్చి, తరిమి కొట్టిన సంఘటనలు ఎన్నెన్నో!

బొరిగి పంచాయితీ తెల్లపాయ్ గ్రామంపై 2009 జూన్‌లో 50 మంది పోలీసులు దాడి చేసి ఇండ్లలోకి దూరి సామాన్లన్నీ చిందరవందర చేసి పురుషులను పట్టుకెళ్లడానికి ప్రయత్నించారు. దానితో మహిళలంతా కల్సి ఒక పోలీసును పట్టుకొని కొట్టారు. దానితో భయపడి పోయిన పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి ఆ పోలీసును విడిపించుకొని పారిపోయారు.

బందుగాం బ్లాక్ కేరుబడి పంచాయితీ జంగిడి వలస గ్రామంపై 2009, ఆగస్ట్ 3న 35 మంది ఎ.పి. గ్రేహౌండ్స్ పోలీసులు దాడి చేశారు. ఆ సమయంలో గ్రామంలో మహిళలు మాత్రమే వున్నారు. వాళ్లంతా పోలీసులను చుట్టుముట్టి ఘర్షణ పడుతూనే పనులకు వెళ్లిన తమ పురుషులకూ, సమీప గ్రామస్తులకూ కబురు పంపించారు. కొద్ది సేపట్లోనే అన్ని వైపుల నుండి స్త్రీ పురుషులు సాంప్రదాయక ఆయుధాలతో వచ్చి పోలీసుల దగ్గరున్న ఆయుధాలూ, సెల్‌ఫోన్లూ, కిట్ బ్యాగులు గుంజుకున్నారు. ఎ.పి. పోలీసులు ఒడిషాలోకి ఎందుకొస్తున్నారంటూ పోలీసులను తాళ్లతో కట్టేశారు. కొంత మంది పోలీసులు 'మాకు పిల్లలున్నారు వదిలేయండి' అంటూ ప్రజల కాళ్లా వేళ్లా పడ్డారు. ప్రజలు వాళ్లను బందీలుగా ప్రధాన రహదారి వరకూ నడిపించుకు వెళ్లారు. బి.డి.ఓ., ఎస్.ఐ.లు వచ్చి హామీ పత్రం రాసి ఇస్తేగానీ ప్రజలు పోలీసులను వదిలేయలేదు.

బొరిగి పంచాయితీ దిగువలొచ్చి అనే గ్రామంలో పోలీసులు దాడి చేసినప్పుడు ఒక యింట్లో వంట చేస్తున్న పెజ్జును (స్త్రీ వేషధారణలో వుండి ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం పూజలు చేసే పురుషుడు) మహిళగా భావించి వేధించడానికి ఇద్దరు పోలీసులు లోపలికి వెళ్లారు. వెంటనే ఆ పెజ్జు పొయ్యి మీద వున్న వేడి నీళ్లను పోలీసుల పైకి విసిరాడు. కాలిపోయిన మొహాలతో, హాహాకారాలతో పోలీసులు పరుగులు తీశారు. పారిపోతున్న పోలీసులపై మహిళలు, పిల్లలు రాళ్లు విసురుతూ ఊరి పొలిమేర వరకూ వెంట తరిమారు.

2009 అక్టోబర్ నెలలో పోలీసులు ఛసి ములియా సంఘ్ నాయకుడు నాచిక లింగ, సింగన్న, రాంపాడలను అరాచకులుగా, లూటీ చేసేవారుగా చిత్రీకరిస్తూ వారి ఫోటోలను ముద్రించిన పోస్టర్లను వేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ రెండు వేల మంది మహిళలే కదిలి నారాయణపట్నం పోలీస్ స్టేషన్‌ను చుట్టు ముట్టారు. స్టేషన్ ఆవరణలో వున్న పోస్టర్లను చింపివేశారు. స్టేషన్ గేట్లకు తాళం వేసినా, లాఠీ ఛార్జ్ చేసినా గేట్లు దూకి లోపలికి వెళ్లి స్టేషన్ ఆఫీసర్‌ను నిలదీశారు.

నవంబర్ 20న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిలదీసిన సంఘటనలోనూ మహిళలు చురుగ్గా పాల్గొన్నారు. కాల్పుల అనంతరం అందరూ చెల్లా చెదురై పోయిన పరిస్థితిలో సింగన్న, ఆంద్రుల శవాల కోసం ఎవరు వెళ్లినా అరెస్ట్ చేస్తారనే ఆందోళనాకరమైన పరిస్థితిలో మహిళలే వెళ్లి పోలీసులతో కొట్లాడి శవాలను తీసుకొచ్చారు. మహిళల ఈ చొరవ వల్లనే వేలాది మంది ప్రజలు తమ ప్రియతమ నాయకుల అంత్యక్రియలను గౌరవప్రదంగా జరుపుకోగల్గారు.

నవంబర్ 20 సంఘటన తర్వాత పోలీసులు గ్రామాలపై విచ్చలవిడిగా దాడులు చేసి పురుషులను పట్టుకొని తుపాకీ మడమలతో

కొట్టడం, అరెస్ట్ చెయ్యడం సర్వ సాధారణం అయింది. ఇటువంటి ఎన్నో సందర్భాల్లో మహిళలు తీవ్రంగా ప్రతిఘటించారు, పోలీసుల వెంటబడి పురుషులను విడిపించుకోవడంలోనూ, పోలీస్ స్టేషన్లను ఘెరావ్ చేయడంలోనూ, ర్యాలీలూ, ధర్నాలు చేయడంలోనూ మహిళలు చురుగ్గా ఉంటున్నారు. ఇలా మహిళలు ప్రతిఘటించిన అనేక సందర్భాల్లో పోలీసులు మహిళలను బూతులు తిట్టడం, కొట్టడం చేస్తున్నారు. పిల్లలను సైతం ఉపేక్షించడం లేదు. పోలీసుల ఈ దౌర్జన్యాల కారణంగా అనేక మంది మహిళలు, పిల్లలు తలలు పగిలి గాయాలపాలయ్యారు. అలా గాయాలతోనే, పగిలిన తలలతోనే పోలీస్ స్టేషన్లకు వెళ్లి తమ వాళ్లను విడిపించుకున్న ఘటనలు ఎన్నెన్నో వున్నాయి.

మహిళల ఈ సంఘటిత శక్తినీ, ప్రతిఘటననూ అణచడం కోసం నవంబర్ 20 సంఘటన తర్వాత పాలపుట్ అనే గ్రామంలో మహిళా సంఘం నాయకురాలు కుముదినిని అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. పశ్చింగ్ గ్రామ సంఘ నాయకురాలు సంతకు వెళ్లి వస్తుండగా మార్గమధ్యంలోనే ఆమెను అరెస్ట్ చేసి పట్టుకెళ్లిపోయారు.

ప్రస్తుతం సంఘ నాయకులనూ, పురుషులను అరెస్ట్ చేస్తుండడం వల్ల గ్రామాల్లో మహిళలు పిల్లలు, వృద్ధులే వుంటూ వ్యవసాయ పనులు చేస్తున్నారు. సాంప్రదాయక ఆయుధాలతో సెంట్రీలు చేస్తూ తమ గ్రామాలనూ, ఆస్తులనూ, పంటలనూ రక్షించుకుంటున్నారు. సంతలకు సైతం మహిళలూ, వృద్ధులే వెళ్తూ నిత్యావసర వస్తువులను తెచ్చుకుంటున్నారు.

పోలీసులు, భూస్వాములు ఎన్ని ఆటంకాలు కల్పించినా, కోతలకు వస్తే కాల్పులు జరుపుతామని బెదిరించినా పోరాడి సాధించుకున్న తమ భూముల్లో పంటల కోతలకు మహిళలు నడుం బిగిస్తున్నారు. కాల్పులు జరిపినా, నెత్తురు పారినా, ఆ భూముల్లోనే ప్రాణాలు విడుస్తాం కానీ ఆ భూములను వదలం అని ప్రతిన బూనుతున్నారు.

ఇలా వర్తమాన చరిత్రకు సరికొత్త సాహస అధ్యాయాలను జోడిస్తున్న ఈ మహిళలు ఈ చరిత్ర పట్ల మన బాధ్యతను మరింతగా పెంచుతున్నారు.

(ఆదివాసీ ఛసి ములియా సంఘ్ ప్రచురించిన 'నారాయణపట్నం ఆదివాసీ రైతాంగ పోరాట జ్వాలల్ని ఎవరూ ఆపలేరు' పుస్తకం ఆధారంగా...)